నమస్తే తెలంగాణ
నిజామాబాద్, ఆదివారం 28 ఏప్రిల్ 2024
SUNDAY, APRIL 28, 2024

## ప్రభుత్వం మారడంతో నిధుల విడుదలకు ఇబ్బంది



డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల బిల్లుల కోసం వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 27 : ప్రభుత్వం మారడంతో పెండింగ్ బిల్లుల విడుదలకు ఇబ్బందిగా మారిందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన 40 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులు పెండింగ్ బిల్లుల కోసం శనివారం బాన్సువాడలోని పోచారం స్వగృహంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. నియోజకవర్గానికి రావాల్సిన పెండింగ్ బిల్లులకు సంబంధించిన లెటర్‌ను సుమారు రెండు నెలల క్రితమే కలెక్టర్ కార్యాలయానికి పంపించానని తెలిపారు. కానీ.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని, అంతలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల ప్రక్రియ అక్కడే ఆగిపోయిందని తెలిపారు. నిధులు ఇవ్వకపోతే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అందరితో కలిసి నేను నిరసన కార్యక్రమాలు చేపడతానని అన్నారు. అవసరమైతే అందరం కామారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వెళ్దామని చెప్పారు. కొన్ని రోజుల క్రితం పెండింగ్ బిల్లుల గురించి సంబంధిత మంత్రిలో ఫోన్‌లో మాట్లాడానని, అప్పుడు మంత్రి సుముఖత తెలిపారని, కానీ కారణం ఏంటో చెప్పకుండా ఇప్పుడు మాట దాటవేస్తున్నాడని ఆవేదనను వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి రూపాయినీ ప్రభుత్వం ఇచ్చేవరకు పోరాటం చేస్తానని లబ్ధిదారులకు పోచారం హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

బీబీపేట్, ఏప్రిల్ 27: రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ అధికారులు అప్రమత్తం చేయడంపై రైతులు ఆనందంగా ఉన్నారని అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బీబీపేట్ మండలంలోని జనగామ, దోమకొండ మండలంలోని అంచనూర్, లింగుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహణ తీరును తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ ఆగ్రో ఇండస్ట్రీస్, జనగామలోని ఉమా మహేశ్వరీ బాయిల్ రైస్ మిల్లులను పరిశీలించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకున్నదని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 48 గంటల్లోగా రైతుల ఖాతాలో డబ్బులు వేయాలని అధికారులను ఆదేశించారు. గోనె సంచుల కొరత రాకుంగా మానిటరింగ్ చేస్తున్నామని, అకాల వర్షాలతో రైతులను అప్రమత్తంగా చేస్తూ అవసరమైన టార్పాలిన్లు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ కిష్టాయ్య, అధికారులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనగామలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి

# బీఆర్ఎస్ అంటే ప్రజలకు భరోసా

**మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం**

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 27 : తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అంటే ఒక భరోసా అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పోచారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధించడమే కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి గడపకూ చేరేలా ఎంతో కృషి చేసిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కొందరు నాయకులు పార్టీని వీడినంత మాత్రాన బీఆర్ఎస్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పారు. బీఆర్ఎస్ తెలంగాణలో, బీజేపీ కేంద్రంలో ఒకే సారి ప్రభుత్వంలోకి వచ్చాయని, గత పదేండ్లలో తెలంగాణలో రైతే రాజు అన్న చందాన కేసీఆర్ ప్రభుత్వం పనిచేసిందని, మరి బీజేపీ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను మోదీ ఎక్కడ అమలు చేశాడో రైతులకు సమాధానం చెప్పాలన్నారు. రైతులను మోసం చేసిన మోదీ అంబానీ, ఆదానీలకు చెందిన సంస్థలకు లక్షల కోట్ల రూపాయల అప్పులను మాఫీ చేశారని, ప్రజాస్వామ్య దేశంలో బీజేపీ మోసపూరిత ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయకపోతే రాజీనామాకు సిద్ధమని హరీశ్‌రావు విసిరిన చాలెంజ్‌ను ఎందుకు స్వీకరించడం లేదని, ఆయన ఇస్తున్న హామీలపై ఆయనకే నమ్మకం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలే న్యాయ నిర్ణేతలని, వారికి నచ్చితే తలపై కూర్చుండ బెట్టుకుంటారని నచ్చకపోతే కింద పడేస్తారని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ అంజి రెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, ఆత్మకమిటీ చైర్మన్ మోహన్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఉదయ్, సీనియర్ నాయకుడు ఎజాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



బాన్సువాడలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

**ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం**

కామారెడ్డి/గాంధారి, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంజీ వేణుగోపాల్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, గైని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గాంధారి మండలంలోని వెంకటాపూర్ తండాలో బీఆర్ఎస్ నాయకులు గులాబీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ అభివృద్ధి కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు రాధాబలరాం పాల్గొన్నారు.



కామారెడ్డిలో గులాబీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్



గాంధారి మండలం వెంకటాపూర్ తండాలో..

# కేసీఆర్ పాలనలో సుభిక్షంగా రాష్ట్రం

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలవడం ఖాయం
- ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



కొల్లూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 27 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సుభిక్షంగా ఉందని, ఉత్తుత్తి హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో దుర్భిక్షంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా మండలంలోని సోమేశ్వర్, కొల్లూరు, నాగారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొల్లూరు గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే చేతులెత్తేసిందని విమర్శించారు. ఉన్న పథకాలను సక్రమంగా అమలు చేయని అసమర్థ ప్రభుత్వమని అన్నారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా తరిమి కొట్టాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి వెన్నంటి ఉన్న బాన్సువాడ నియోజకవర్గ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు మంచి మెజార్టీని తెచ్చిపెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్‌ను గెలిపిస్తామని ఉపాధిహామీ కూలీలు నినాదాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నెర్రె నర్సింహులు, నాయకులు మహ్మద్ ఎజాస్, గంగుల గంగారాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

కామారెడ్డి, ఏప్రిల్ 27 : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ ఇంటర్, పదోతరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఇంటర్ పొలిటికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 1,016 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావా ల్సి ఉండగా 899 మంది హాజరయ్యారు. 117 మంది గైర్హాజరయ్యారు. పదోతరగతి మ్యాథమెటిక్స్ పరీక్ష ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 861 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 748 మంది హాజరయ్యా రు. 113 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు.

## బోర్లంలో కుస్తీ పోటీలు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 27 : మత్తడి పోచమ్మ జాతరను పురస్కరించుకొని మండలంలోని బోర్లం గ్రామంలో శనివారం కుస్తీ పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు బాన్సువాడతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజల పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విజేతలకు నగదు బహుతును అందజేశారు.

## చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

మాచారెడ్డి, ఏప్రిల్ 27 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూ.4,98,300 పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎస్టీ అధికారి మహేందర్‌తో కలిసి శనివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలూ లేని నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన

కామారెడ్డి, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రంలో సాందీపని డిగ్రీ కళాశాలలో ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ మాట్లాడుతూ.. ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకూ లొంగకుండా వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సాందీపని కళాశాల డైరెక్టర్ బాలాజీరావు, ప్రిన్సిపాల్ సాయిబాబా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాన్సువాడ, ఏప్రిల్ 27 : బాన్సువాడ పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉందని పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లికి చెందిన సాయికుమార్‌తోపాటు బీర్కూర్ మండలం చించొల్లికి చెందిన పెంట మారుతి బాన్సువాడకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి చించొల్లికి వెళ్తుండగా పట్టణంలోని పెద్దపూల్ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న మారుతి ఆల్టో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ మారుతి కాళ్లపై నుంచి వెళ్లింది. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా రామయంపేట్ వద్ద మృతి చెందినట్లు చెప్పారు. తీవ్ర గాయాలైన సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారని, అతని పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. బోధన్ రోడ్డు నుంచి ఎదురు గా వచ్చిన కారు, వెనకనుంచి వస్తున్న లారీ డ్రైవర్ షేక్ ఇలియాస్ అజాగ్రత్తగా నడపడంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కింద పడిపోయారని తెలిపారు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## రేపు బిచ్కుందలో బీఆర్ఎస్ ప్రచారం

బిచ్కుంద, ఏప్రిల్ 27: మండలంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ బిచ్కుంద గ్రామశాఖ అధ్యక్షుడు అవార్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు బిచ్కుందలోని శివాజీ విగ్రహం వద్ద రోడ్ షో, కార్నర్ మీటింగ్ ఉంటాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## 2వ తేదీలోపు ఇంటర్ ఫీజు చెల్లించాలి

మద్నూర్/ రామారెడ్డి, ఏప్రిల్ 27: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా మే రెండో తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని మద్నూర్, రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లు హయగ్రీవ్, మధు శ్రీవాత్సవ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, గడువులోపు పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు(ఫైల్)

# జోరుగా ఇసుక అక్రమ రవాణా



ఇటీవల పోలీసులు పట్టుకున్న వాహనం

- మహారాష్ట్రకు తరలింపు
- ట్రాక్టర్ ఇసుకకు రూ.ఆరువేలు
- అక్రమార్కులకు కలిసి వస్తున్న అధికారుల ఎన్నికల బిజీ

మద్నూర్, ఏప్రిల్ 27: మండలం మీదుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికారుల కండ్లు కప్పి ఇసుక మాఫియా రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తున్నారు. అధికారులు, పోలీసులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు. దీంతో ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్లు, బొలెరో వాహనాల్లో మండలంలోని పలు గ్రామాలతోపాటు మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.ఆరు వేలకు విక్రయిస్తూ.. ఇసుక సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. బిచ్కుంద మండలంలోని ఖత్‌గావ్, డోంగ్లీ మండలంలోని కుర్లా గ్రామ శివారులో ఉన్న మంజీరా నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. ఇటీవల పోలీసులు పలు ట్రాక్టర్లు, బొలేరో వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేశారు. క్వారీల నుంచి ఇసుకను తరలిస్తున్నా మైనింగ్ అధికారులు తమకేమీ పట్టునట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ వేసి, ప్రజలు ఇండ్లు నిర్మించుకునేందుకు అవసరమైన ఇసుకను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**

మండలం నుంచి ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణపై కఠినంగా వ్యవహరిస్తాం. కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తాం. ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించం. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

-ఎస్సై శ్రీకాంత్

## ఎన్నికలు ముగిసేవరకు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌నాయక్**



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 27: ఎన్నికలు ముగిసేవరకు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ అన్నారు. ఎల్లారెడ్డి సబ్‌డివిజన్‌కు చెందిన పోలీసులతో కలిసి ఆయన ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన.. తనిఖీలు చేసే సమయంలో పోలీసులు ఎలా విధులు నిర్వహించాలో వివరించారు. మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎల్లారెడ్డి, లింగంపేట్, గాంధారి ఎస్సైలు బొజ్జ మహేశ్, చైతన్యకుమార్‌రెడ్డి, ఆంజనేయులు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

**బస్సులోకి ఎక్కుతుండగా అపహరణ**

బిచ్కుంద, ఏప్రిల్ 27: బిచ్కుంద బస్టాండ్‌లో శనివారం చైన్ స్నాచింగ్ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన పోశవ్వ బిచ్కుంద బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్నది. ఈ క్రమంలో దుండగులు ఆమె మెడలో ఉన్న తులం బంగారు గుండ్లను చోరీ చేశారు. ఆమె గమనించేలోపు దుండగులు అక్కడి నుంచి పారిపోయారని స్థానికులు తెలిపారు. కొంతకాలంగా బస్టాండ్ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటుచేసి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో స్కూల్ డే



చిన్నారుల తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్న సీడీపీవో సునంద





మాన్యాపూర్‌లో ప్రదర్శన

బిచ్కుంద, ఏప్రిల్ 27: మండలంలోని పుల్కల్, మాన్యాపూర్ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం స్కూల్ డే కార్యక్రమాలను నిర్వహించారు. పుల్కల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సునంద పాల్గొని చిన్నారుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. చిన్నారుల అభివృద్ధి సూచిక, పెరుగుదల స్థాయి, పూర్వ ప్రాథమిక విద్య గురించి వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కొమురవ్వ, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఎఫ్‌ఏకు మెమో జారీ

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 27: మండలంలోని బేగంపూర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజబోయిన వీరయ్యకు శనివారం మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వీరయ్య ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఓ పార్టీ సమావేశంలో పాల్గొన్నాడని తెలిపారు. దీంతో అతడికి మెమో జారీ చేశామని చెప్పారు. ఈ విషయమై రెండు రోజుల్లో లిఖిత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సుదర్శన్ ఉన్నారు.



ఎఫ్ఏ వీరయ్యకు మెమో అందజేస్తున్న ఎంపీడీవో సూర్యకాంత్

## చిన్నారిపై కుక్క దాడి.. తీవ్రగాయాలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 27 : ఓ చిన్నారిపై వీధికుక్క దాడి చేయగా తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ఘన్‌పూర్‌లో శనివారం ఉదయం చోటు చేసుకున్నది. గ్రామంలో ఆరేండ్ల చిన్నారి కుర్మ పూజిత రోడ్డుపై శనివారం ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసింది. కింద పడిపోయిన పూజిత గట్టిగా అరవడంతో గమనించిన ఆమె తల్లి పరుగెత్తుకొచ్చి కుక్కను తరిమేసింది. ఈ ఘటనలో చిన్నారికి తీవ్రగాయాలు కాగా.. చికిత్స నిమిత్తం డిచ్‌పల్లి సీహెచ్‌సీకి తరలించారు. కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.